

చేవెళ్ల మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు, అమ్మవారి మాలధారులు

దుర్గమ్మా.. చల్లంగా దీవించమ్మ

జిల్లాలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అందంగా అలంకరించిన మండపాల్లో దుర్గమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి భక్తులు, దేవి మాలధారులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయాల్లో అమ్మవార్లకు అభిషేకాలు, హోమాలు చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చేవెళ్ల మండల కేంద్రంలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహానికి జై భవాని మాత కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. అలాగే మహేశ్వరం శ్రీ రాజరాజేశ్వరాలయంలో అమ్మవారు కాత్యాయిని దేవి అలంకారంలో భక్తులకు కనిపించారు. మండపాల వద్ద పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. అనంతరం నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

- చేవెళ్ల, మహేశ్వరం



మహేశ్వరం శ్రీ రాజరాజేశ్వరాలయంలో కాత్యాయిని దేవి అలంకారంలో అమ్మవారు

భర్తీ ఎప్పుడో?

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాల కొరత

జిల్లాలో అంగన్‌వాడీల పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా? అని అర్హులు ఎదురు చూస్తున్నారు. మహిళా, శిశు సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మూడున్నరేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్నారు.

- జిల్లాలో 131 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీ
- అత్యధికం ఆయా పోస్టులే..
- కొన్ని కేంద్రాల బాధ్యతలు ఇన్‌చార్జిలకు
- అదనపు భారంతో అవస్థలు పడుతున్న టీచర్లు



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : జిల్లాలో 27 మండలాలు, 5 రెవెన్యూ డివిజన్లలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టుల కింద 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,577 మంది అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్నారు. 25 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 1,380 ఆయా పోస్టులు మంజూరు కాగా.. ప్రస్తుతం 1,274 మంది పనిచేస్తున్నారు. 106 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ప్రాజెక్టుల వారీగా ఇలా..

అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా పరిశీలించగా.. ఆమనగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 232 అంగన్‌వాడీ టీచర్లు మంజూరు కాగా, 227 మంది పనిచేస్తున్నారు. ఐదు టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో 225 టీచర్ పోస్టులు మంజూరు ఉండగా 250 మంది పనిచేస్తున్నారు. ఇక్కడ ఐదు టీచర్ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అలాగే హయత్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో 181 పోస్టులు మంజూరు కాగా, 178 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం ప్రాజెక్టులో 162 టీచర్ పోస్టులు మంజూరు ఉండగా 158 మంది పనిచేస్తున్నారు. నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహేశ్వరం ప్రాజెక్టులో 234 పోస్టులు మంజూరు ఉండగా 232 మంది టీచర్లు పనిచేస్తున్నారు. రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శేరిలింగంపల్లి ప్రాజెక్టులో 220 పోస్టులు మంజూరు ఉండగా 217 మంది టీచర్లు పనిచేస్తున్నారు. మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. షాద్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో 316 టీచర్ పోస్టులు మంజూరు కాగా, 313 మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇక్కడ కూడా మూడు టీచర్ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

అధికంగా ఆయా పోస్టులు ఖాళీ

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల కంటే ఆయా పోస్టులే ఎక్కువగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఆమనగల్లులో 160 పోస్టులు మంజూరు కాగా 151 మంది ఆయాలు పనిచేస్తున్నారు. 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చేవెళ్ల ప్రాజెక్టులో 216 పోస్టులు మంజూరు కాగా 196 మంది పనిచేస్తున్నారు. 20 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హయత్‌నగర్ ప్రాజెక్టులో 177 పోస్టులు మంజూరు కాగా 166 మంది పనిచేస్తున్నారు. 11 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇబ్రహీంపట్నంలో 144 పోస్టులకు గాను 135 పోస్టులు భర్తీగా ఉన్నాయి. ఇంకా 9 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహేశ్వరంలో 209 పోస్టులకు గాను 187 మంది పనిచేస్తున్నారు. అత్యధికంగా 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శేరిలింగంపల్లిలో 212 పోస్టులకు గాను 193 మంది ఆయాలు పనిచేస్తున్నారు. 19 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. షాద్‌నగర్‌లో 265 పోస్టులు మంజూరు కాగా 245 పనిచేస్తున్నారు. ఇంకా 17 మంది ఆయా పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పనిభారంతో సతమతం

అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు రూ.13,650, ఆయాకు రూ.7,800 గౌరవ వేతనంగా అందజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని కేంద్రాల వారికి ఈ వేతనాలు కొంతమేర ఊరటనిచ్చే విధంగానే ఉన్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న కేంద్రాల టీచర్లు, ఆయాలకు ఈ జీతం ఏమాత్రం సరిపోవడం లేదంటున్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురికాకుండా, శారీరకంగా బలహీనం కాకుండా ఉండేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతీరోజు పాలు, ఉడుకబెట్టిన కోడిగుడ్లతో పాటు ఆకు కూరలు, ఇతర కూరలతో కూడుకున్న పౌష్టికాహారం అందిస్తున్నారు. కేంద్రాల్లో రెగ్యులర్‌గా టీచర్లు ఉంటేనే అందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందుతుంది. అలాగే ఆరోగ్య, ఇతర సర్వేల బాధ్యతలను ఎక్కువగా టీచర్లకే అప్పగిస్తూ ఉంటారు. టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్క కేంద్రాల టీచర్లకు అప్పగించడం వల్ల వారిపై అదనపు పనిభారం పడుతుంది. ఆయా పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో టీచర్లే ఆ భారాన్ని మోస్తున్నారు. అక్కడ వాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వాళ్లకు సర్వే బాధ్యతలు అప్పగించినప్పుడు కేంద్రాలు తొందరగానే మూత పడుతున్నాయి. వంటలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఖాళీల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	1,600
టీచర్ల పోస్టులు	1,600
పనిచేస్తున్న వారు	1,577
ఖాళీలు	25
మంజూరైన ఆయాల పోస్టులు	1,380
పనిచేస్తున్న వారు	1,274
ఖాళీలు	106
పిల్లలు, గర్భవతులు, బాలింతల వివరాలు	
7 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు	70,072
3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల లోపు	22,791
గర్భవతులు, బాలింతలు	22,314

అదనపు భారంతో అవస్థలు

రెండు నెలలుగా చేవెళ్లలోని ఫోర్త్ అంగన్‌వాడీ సెంటర్ టీచర్ విజయలక్ష్మి రావడం లేదు. వివిధ కారణాలతో ఆమె ఉద్యోగం మానేసిందని ప్రచారం జరుగుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫోర్త్ అంగన్‌వాడీ సెంటర్ బాధ్యతలు నేనే చూస్తున్నాను. నా కేంద్రంతోపాటు మరో సెంటర్ బాధ్యతలు చూడటం వల్ల పనిభారం పెరిగింది. 0-5 ఏళ్ల పిల్లల బరువు చూడటం, గర్భిణులు, బాలింతల బాగోగులు, చిన్నారుల చదువు తదితర పనులతో ఇబ్బంది అవుతుంది. ఖాళీ అయిన పోస్టును కొత్తవారితో భర్తీ చేయాలి.

- అఫియాబేగం, అంగన్‌వాడీ టీచర్, చేవెళ్ల

ఇంటర్ ఉంటేనే అంగన్‌వాడీ పోస్టు..

అంగన్‌వాడీ టీచర్‌తో పాటు హెల్పర్లుగా ఉద్యోగాలకు నియమితులయ్యేవారు కనీసం ఇంటర్ ఉత్తీర్ణత ఉండాలి. గతంలో అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్న నిబంధన ఉండేది. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, వర్కర్ పోస్టులకు విద్యార్హతను పెంచింది. ఇకపై కనీసం ఇంటర్మీడియెట్ అర్హతగా నిర్ణయించింది. వయోపరిమితి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి. అలాగే 65 ఏళ్ల దాటిన తర్వాత వారి సేవలను వినియోగించుకోకూడదు. ఖాళీల్లో 50 శాతం హెల్పర్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాల్సి ఉంటుంది.

ఎస్సీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం

దరఖాస్తు చేసుకోవాలి

జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి జె. రామారావు

రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 3 : ఎస్సీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం డిసెంబర్ 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి జె. రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ విద్యార్థుల ఉపకార వేతనాల దరఖాస్తులు, మంజూరీలో కొత్తగా విధివిధానాలు వచ్చాయని తెలిపారు. మూడు దశల్లో డెమో, బయోమెట్రిక్, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉంటుందన్నారు. 2024-25 సంవత్సరం నుంచి ఆదాయ పరిమితి రూ. 2 లక్షల నుంచి రూ. 2.50 లక్షలకు పెంచడం జరిగిందని చెప్పారు. ఇతర వివరాల కోసం కలెక్టరేట్‌లోని షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

న్యాయవాదిపై దాడిని నిరసిస్తూ

విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3: నగరంలోని నాంపల్లి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది మహ్మద్ అబ్దుల్ కలీంపై మాదన్నపేట్ పోలీస్ అధికారులు చేసిన దాడిని నిరసిస్తూ గురువారం ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. తెలంగాణ అడ్వకేట్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపు మేరకు నిరసన తెలిపినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరెడ్ల అంజన్‌రెడ్డి తెలిపారు. తక్షణమే న్యాయవాదులకు రక్షణ చట్టం అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి జే.పీ.మహేందర్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మావతి

మాడ్గుల, అక్టోబరు 3 : తాగునీటి సరఫరాపై మిషన్ భగీరథ సహాయకులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో పద్మావతి అన్నారు. గురువారం మాడ్గుల మండల పరిషత్ కార్యాలయంలో సహాయకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ నాలుగు రోజుల పాటు కొనసాగుతుందని ఆమె తెలిపారు. నీటి సరఫరాలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. నీటి ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ సాంద్రత, నీటిలో ఉండాల్సిన లవణాల శాతం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి నర్సిరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు శ్రీనివాస్, ధీరజ్, శైలజ, అనిత పాల్గొన్నారు.

వినియోగం ఉందా?

నిర్మించారు.. వదిలేశారు

- మార్కెట్ కట్టినా రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- స్టాల్స్ ఇరుకుగా ఉన్నాయని రైతులు, వ్యాపారుల అనాసక్తి
- ట్రాఫిక్ జామ్‌తో నానా అవస్థలు



మార్కెట్‌లో ఇరుకైన గదుల్లో సామగ్రి



రోడ్డుపై కొనసాగుతున్న సంత

ఆదిభట్ల, అక్టోబరు 3 : ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్ల గ్రామంలో కూరగాయల సంత రోడ్డుపైనే కొనసాగుతోంది. దాంతో ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వివిధ సంస్థల్లో పనిచేసే కార్మికులు, కొంగరకలాన్, నాదర్‌గుల్ తదితర గ్రామాలకు వెళ్లేవారితో గ్రామంలోని ఈ రోడ్డు సాయంత్రం వేళ రద్దీగా ఉంటుంది. ఆదిభట్లకు వచ్చే ఆర్టీసీ బస్సులు కూడా మున్సిపల్ కార్యాలయం ముందు నుంచే తిరిగి వెళ్తుంటాయి. చిన్నగా ఉండి ఇరుకైన స్థలం కావడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అయితే, రోడ్డు పక్కన కొనసాగుతున్న మార్కెట్‌ను మరోచోటుకు తరలించేందుకు ఆదిభట్ల మున్సిపల్ కేంద్రంలో రూ.5 లక్షలు వెచ్చించి మార్కెట్ నిర్మాణం చేపట్టారు. రైతులకు ఇబ్బంది తలెత్తకుండా కూరగాయలు విక్రయించేందుకు నిర్మించిన మార్కెట్ నేడు నిరుపయోగంగా మారింది. తమకు కేటాయించిన గదులు ఇరుకుగా ఉన్నాయనే నెపంతో రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు చేపడుతున్నారు.

రూ.5లక్షలతో మార్కెట్ నిర్మాణం

ఆదిభట్లలో ట్రాఫిక్ సమస్యలు తీర్చుతూనే ప్రజలకు తాజా కూరగాయలు అందుబాటులో ఉండేలా మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం కోసం మున్సిపల్ నిధులు రూ.5లక్షలు వెచ్చించి 20 మంది కూరగాయలు అమ్ముకునేలా స్టాల్స్ నిర్మించి రైతులకు కేటాయించారు. అదేవిధంగా టాయిలెట్స్‌నూ నిర్మించారు. కానీ, స్టాల్స్ చిన్నవిగా ఉన్నాయని, కూరగాయలకు ఉంచడానికి స్థలం సరిపోవడం లేదని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. తమకు కేటాయించిన స్టాల్స్‌లో సామగ్రి(సంచులు, గంపలు)ని ఉంచి తాము మాత్రం రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తామని వారు చెబుతున్నారు.

ఇరుకైన స్థలంలో ఇబ్బందిగా ఉంది



అందరి సమస్యలను దృష్టిలో పెట్టుకొని కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. అయితే, గదులు చాలా చిన్నగా కట్టారు. కనీసం మనిషి కూర్చునేందుకు కూడా వీల్లేకుండా ఉంది. ఇరుకైన స్థలంలో కూర్చుంటే కూరగాయలు పెట్టుకోవడం కష్టంగా ఉంది. గత్యంతరం లేక రోడ్డుపైనే అమ్ముకుంటున్నాం.

- కోరె జంగయ్య

అనాలోచితంగా కట్టారు



మున్సిపల్ కార్యాలయం ముందు నిర్మాణాలకు అనువైన స్థలమే లేదు. అధికారులు అనాలోచితంగా నిర్మాణం చేపట్టారు. స్థలం చాలా తక్కువగా ఉండటంతో ఇబ్బందిగా ఉంటోంది. కూరగాయలు విక్రయదారులకు సరిపడా స్టాల్స్ నిర్మించలేదు. ఇబ్బందులు తొలగించి సంతను రోడ్డుపై నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలి.

- పల్లె రజినీకాంత్ గౌడ్, కాంగ్రెస్ నాయకుడు

సమస్య పరిష్కారానికి చర్యలు



కూరగాయల సంత రోడ్డుపై ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రూ.5లక్షలు వెచ్చించి మార్కెట్ నిర్మించాం. 20 మంది కూరగాయలు విక్రయించేలా ఏర్పాట్లు చేశాం. గదులు ఇరుకుగా ఉన్నాయని రోడ్డుపైనే విక్రయాలు సాగిస్తున్నారు. ఈ సమస్యను త్వరలో పరిష్కరిస్తాం.

- బాలకృష్ణ, కమిషనర్, ఆదిభట్ల మున్సిపాలిటీ

పకడ్బందీగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

- పూర్తి వివరాలు రికార్డుల్లో పొందుపర్చాలి
- సిబ్బందికి కలెక్టర్ శశాంక సూచన
- పెద్దతూప్రాలో ఇంటింటి సర్వే పరిశీలన



పెద్దతూప్రాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పథకం సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

శంషాబాద్, అక్టోబరు 3 : శంషాబాద్ మండల శివారు పెద్దతూప్రా గ్రామంలో గురువారం రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద చేపడుతున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు పథకం ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ శశాంక స్వయంగా పరిశీలించారు. ప్రతీ ఇంటిలో వివరాలను పక్కాగా సేకరించాలని సిబ్బందికి కలెక్టర్ సూచించారు. ప్రతీ అంశాన్ని రికార్డుల్లో పొందుపర్చాలన్నారు. ఎంపీడీవో మున్ని ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు

రంగారెడ్డి అర్బన్ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానాకాలంలో పండించిన ధాన్యం సేకరణకు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వాటిల్లో అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. రైతులు ధాన్యం తీసుకొచ్చిన వెంటనే తూకం వేయాలన్నారు. కేంద్రాల వద్ద హమాలీలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. రైస్ మిల్లుల వద్ద కూడా లారీల నుంచి ధాన్యం త్వరితగతిన దిగుమతి చేసుకునేలా పర్యవేక్షించాలన్నారు. కేంద్రాలలో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్నారు. సన్న రకం, ముతక రకానికి సంబంధించి సంబంధిత అధికారులకు అవసరమైన శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లైస్ డీఎం గోపీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావు, జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మద్ రియాజ్, డీసీవో సుధాకర్ పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు

ధాన్యం కొనుగోళ్లపై సచివాలయం నుంచి సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం కలెక్టర్ శశాంక మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, వేయింగ్ మిషన్, క్లీనర్స్, డైలీ ట్రాక్ షీట్లు రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వాతావరణ శాఖ నుంచి వచ్చే సూచనలను ఐకేపీ సెంటర్లలో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారి, మార్కెటింగ్ శాఖ అధికారి పాల్గొన్నారు.

కోరిన వారికి పని కల్పించాలి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కోరిన వారందరికీ పని కల్పించాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనుల ప్రణాళిక రూపకల్పనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. గతేడాది ఈజీఎస్‌లో సాధించిన ప్రగతిపై అధికారులను ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి శ్రీలత, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, పంచాయతీ అధికారి సురేష్ మోహన్, పాల్గొన్నారు.

సంఘటితంగా హక్కులు సాధించుకుందాం
ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

పరిగి, అక్టోబరు 3: సంఘటితంగా ఉండి హక్కులు సాధించుకుందామని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, డి.మాణిక్యలు అన్నారు. పరిగిలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ-డి నుంచి ఏ లోకి మార్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాల్సిన అవసరముందన్నారు. ఈ నెల 6వ తేదీన వికారాబాద్‌లోని చాయ్ ఇన్ బ్యాంకిట్‌హాల్‌లో ముదిరాజ్‌ల సన్నాహక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ప్రధానకార్యదర్శి కాసాని వీరేశ్, ఫైనాన్స్ కమిషన్ సభ్యుడు రమేశ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్, తదితరులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.నాగేశ్వర్, లక్ష్మణ్, తిరుపతయ్య, దస్తయ్య, వెంకటేశ్, రాచంద్రయ్య పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించాలి

- నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, అక్టోబర్ 3: తెలంగాణ-కర్ణాటక సరిహద్దు కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి అందరూ సహకరించాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కోరారు. గురువారం నిర్వహించిన ఆలయ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ చైర్మన్‌గా నవీన్ చంద్రారెడ్డి, సభ్యులు బి.రాజు, జి. లాలయ్యగౌడ్, లాలయ్యనాయక్, పి.శాంతప్ప, సి.లక్ష్మీ, కె.ఈశ్వరమ్మ ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి కలిసి కట్టుగా పనిచేద్దామని కోరారు. పురాతనమైన, పేరుగాంచిన ఈ ఆలయాన్ని సరిహద్దు కర్ణాటక రాష్ట్ర మాజీ మంత్రి అరవింద లింబావళి ఎంతగానో అభివృద్ధి చేశారని అన్నారు. మరింత అభివృద్ధి చేసేందుకు ముందుకు వస్తున్న ఆయనకు తమ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి మాట్లాడుతూ కొత్లాపూర్ ఎల్లమ్మ అమ్మవారు తమ ఇంటి దేవత అని తెలిపారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న సమయంలో ఆలయాన్ని నిర్మించేందుకు కృషి చేశామని గుర్తు చేశారు. భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇస్తే ఆలయాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ ఉపాధ్యక్షుడు ఎస్.రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, ధారాసింగ్, ఉత్తంచంద్, నారాయణరెడ్డి, నాగప్ప, వడ్డె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న పాలకవర్గం, పక్కన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కేరళ వేద పండితులతో సంప్రోక్షణ

అమ్మవారి ఆలయంలో కేరళ వేద పండితులతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అరవింద లింబావళి కేరళకు చెందిన ఆరుగురు పండితులతో ముందుగా ఆలయంలో సంప్రోక్షణ చేసి పూజలు ప్రారంభించారు. ఆలయాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే విషయంపై మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ప్రస్తుత చైర్మన్ నవీన్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు, మాజీ సర్పంచ్ బుడ్డెళ్లి సాయిలు, ఈవో శేఖర్‌గౌడ్‌తో ఆలయ ఆవరణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

ధాన్యం సేకరణలో జాగ్రత్తలు తీసుకోవాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, అక్టోబరు 3 : వానాకాలం ధాన్యం సేకరణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి వరిధాన్యం సేకరణ, డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ఉపాధ్యాయ నియామక ప్రక్రియపై కలెక్టర్లు, ఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. అనంతర జిల్లా అధికారులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. ధాన్యం సేకరణ కేంద్రాల్లో వ్యవసాయ శాఖ అధికారులు, పౌర సరఫరాల అధికారులు సమన్వయంతో వడ్ల సేకరణ సజావుగా జరిగేలా చూడాలని సూచించారు. దొడ్డు బియ్యం, సన్నబియ్యం వేరువేరుగా సేకరించే విధంగా ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు, తేమ మిషన్లు అందుబాటులో ఉంచుకోవాలని, గోనె సంచులు సరిపడా అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను ఈనెల 5లోపు పూర్తి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవిని ఆదేశించారు. ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ సజావుగా జరపాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీసీఎస్‌వో మోహన్‌బాబు, డీఎంసీఎస్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి

సీఎంను కలిసిన ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి

తాండూరు, అక్టోబరు 3: శాసనమండలి చీఫ్‌విప్‌గా నియమితులైన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాండూరు, పరిగి, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కాలే యాదయ్య, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, సీనియర్ నాయకులు హరివర్ధన్ రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

అభివృద్ధిపై కృషికి ధన్యవాదాలు

బొంరాస్‌పేట్, అక్టోబరు 3: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. గురువారం హైదరాబాద్‌లో సీఎంను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొడంగల్ నియోజకవర్గంపై దృష్టి సారించి అభివృద్ధికి కృషి చేయడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, సీనియర్ నాయకులు వెంకట్రాములుగౌడ్, రామచంద్రారెడ్డి, అర్జున్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కృష్ణ, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భార్యాభర్తలను కత్తితో బెదిరించి బంగారం చోరీ

చేవెళ్ల, అక్టోబరు 3: గుర్తుతెలియని ఇద్దరు దుండగులు భార్యాభర్తలను కత్తితో బెదిరించి వారి వద్ద ఉన్న ఐదున్నర తులాల బంగారం చోరీ చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసారం గేట్ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూక్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామానికి చెందిన మంగలి బసప్ప అతని భార్య లక్ష్మమ్మ(మంగమ్మ) ఇరువురు.. లక్ష్మమ్మకు అనారోగ్యం కారణంగా ఉదయం చేవెళ్ల పట్టణంలోని ఆసుపత్రిలో సీటీ స్కానింగ్ కోసం కారులో వచ్చారు. స్కానింగ్ పూర్తయిన తర్వాత రిపోర్టు ఇవ్వడానికి మూడు గంటల తర్వాత సమయం పడుతుందని సిబ్బంది చెప్పడంతో వారు చిలుకూరు బాలాజీని దర్శించుకునేందుకు వెళ్లారు. తిరిగి బయలుదేరి వస్తున్న సమయంలో చేవెళ్ల మండల పరిధిలోని కేసారం గేట్ సమీపంలోని హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారికి కొద్ది దూరంలో కారు ఆపి భోజనం చేసేందుకు చెట్టుకింద కూర్చున్నారు. ఇంతలో ముఖానికి ముసుగువేసుకున్న ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని కత్తితో బెదిరించారు. వారు భయపడి లక్ష్మమ్మ మెడలోని బంగారు మంగళసూత్రంతో పాటు కమ్మలు, భర్త మెడలో ఉన్న బంగారు గొలుసు తీసి వారికి ఇచ్చారు. వాటిని తీసుకొని దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. రోదిస్తూ చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

- వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర

పరిగి, అక్టోబరు 3: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర అధికారులకు సూచించారు. పరిగి మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీలో ప్రారంభించిన సర్వే తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ కార్డు మాదిరిగానే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉంటుందని తెలిపారు. కుటుంబంలోని సభ్యులందరి వివరాలు ఈ కార్డులో ఉంటాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసే సిబ్బంది ప్రతీ ఇంటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారని చెప్పారు. వివరాల సేకరణలో ఎలాంటి తప్పులు దొర్లకూడదని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, కమిషనర్ వెంకటయ్య, డీసీసీ కార్యదర్శి కె.హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పగిడిపల్లి గ్రామంలో..

యాలాల: గ్రామాల్లో డిజిటల్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పగిడిపల్లి గ్రామంలో చేపట్టిన సర్వే తీరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి సర్వే వివరాలు సేకరించాలని సూచించారు. కార్యక్రమంలో యాలాల తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీవో పుష్పలీల, ఎంపీవో యాదయ్య, మహేష్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో వాసుచంద్ర

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- 1,550 గ్రాములు స్వాధీనం

ఆదిభట్ల, అక్టోబరు 3: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 1,550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం కొంగరకలాన్ పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్న కార్మికులకు విక్రయించడానికి ఓ వ్యక్తి వస్తున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్సై వెంకటేశ్ తన బృందంతో కలిసి బొంగుళూర్ ఔటర్ సర్వీస్ రోడ్డులో కాపు కాశారు. సాయంత్రం ఆరున్నర గంటల ప్రాంతంలో తుక్కుగూడ వైపు అనుమానస్పదంగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా అతనివద్ద 1,550 గ్రాముల బ్యాంకాక్ గంజాయి దొరికింది. నిందితుడు మహారాష్ట్ర వెస్ట్ ముంబాయికి చెందిన రోమీ భరత్ కల్యాణ్‌గా గుర్తించారు. ఇతను కేరళకు చెందిన టోబి అనే వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించే వాడని తెలుస్తోంది. అలాగే అతనిపై గతంలో పలు పోలీస్ స్టేషన్‌లలో కేసులు నమోదైనట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హైటెన్షన్ విద్యుత్ లైన్ మార్గాన్ని మార్చాలి

కడ్తాల్ , అక్టోబరు 3: హై టెన్షన్ విద్యుత్ లైన్‌ను తమ పంట పొలాల మీదుగా వేయొద్దని కడ్తాల గ్రామ రైతులు, నాయకులు అధికారులను కోరారు. ఒకవేళ పనులను చేపడితే అడ్డుకుంటామని హెచ్చరించారు. కడ్తాల గ్రామాన్ని అనుసరించి 66 సర్వే నంబర్లలోని పంట పొలాల మీదుగా 765 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటుకు పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎల్‌అండ్‌టీ సంస్థ శ్రీకారం చుట్టింది. బీదర్ నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు ఏర్పాటు చేసే కొత్త హై టెన్షన్ లైన్‌ను తమ పొలాల మీదుగా ఏర్పాటు చేస్తే కోట్ల రూపాయల విలువైన భూములు కోల్పోయి రోడ్డున పడుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఈ మేరకు సంబంధిత గ్రిడ్ అధికారులను కలిసి లైన్ ఏర్పాటు మార్గంలో అనేక చోట్ల వెంచర్లు , కోళ్ల పరిశ్రమలు, పాడిషెడ్లు, వ్యవసాయ బోర్లు ఉన్నాయని అధికారులకు వివరించారు. ప్రస్తుతం తలపెట్టిన మార్గం నుంచి కాకుండ గ్రామానికి దూరంగా లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు షాద్‌నగర్ డివిజినల్ జనరల్ మేనేజర్ సంతోష్ కుమార్, చీఫ్ మేనేజర్ గణేశ్‌లకు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రైతుల అభ్యర్థనను ప్రభుత్వానికి, పవర్‌గ్రిడ్ ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కడ్తాల మాజీసర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ, జంగారెడ్డి, రైతులు చేగూరి రాములు, జంగారెడ్డి, రాములు, అండేకార్ శ్రీనివాస్, గోరటి జంగయ్య, అభిషేక్‌రెడ్డి, క్యామ రాజేశ్, గణేశ్, అంజయ్య, వెంకట్రాములు, పాండు, శివరామ్ రెడ్డి, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణను వినియోగించుకోవాలి

కొడంగల్, అక్టోబరు 3: ఓటరు జాబితా సవరణను వినియోగించుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం కొడంగల్ నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితాలో తప్పులు ఉంటే సవరణతో పాటు నూతన ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఓటరు జాబితాలో తప్పులకు తావివ్వకుండా పారదర్శకంగా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి

యాచారం, అక్టోబరు 3 : ఫార్మాసిటీ కోసం రైతులను సంప్రదించకుండా నిషేధిత జాబితాలో ఉంచిన భూములను వెంటనే తొలగించి ఆ రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని పర్యావరణవేత్త కవుల సరస్వతీ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆయా రైతులకు వర్తింపచేయాలని హైకోర్టు ఆదేశాలను జారీ చేసినా ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. రైతులకు న్యాయం చేయకపోతే ప్రభుత్వ అధికారుల తీరుపై కోర్టుకెళ్తామని ఆమె చెప్పారు.

ఓ వర్గానికి భూ కేటాయింపుపై నిరసన

నవాబుపేట, అక్టోబరు 3: క్రైస్తవులకు భూమి కేటాయించడం సరైంది కాదని హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట హిందు జనశక్తి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. వట్టిమీనపల్లి గ్రామ రెవెన్యూ సర్వే నెం.100లో క్రైస్తవ మతస్థులకు 6.21 ఎకరాల భూమిని కేటాయింస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జయరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హిందూ జనశక్తి జిల్లా కార్యదర్శి సారా జగన్, వట్టిమీనపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుకు బీజేపీ పోరాటం

చౌదరిగూడ ,అక్టోబరు 3: రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు కాని హామీలను ప్రకటించి అధికారంలోకి వచ్చిందని అవన్నీ అమలయ్యేంతవరకు బీజేపీ పోరాటం చేస్తుందని బీజేపీ నేతలు హెచ్చరించారు. కొందుర్గు మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ కో-కన్వీనర్ కందూరి మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉమ్మెంత్యాలలో మండల సభ్యత్వ ప్రముఖ్ చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీలో కుల, మతాలతో సంబంధం లేకుండా సభ్యత్వాలు పొందాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రతీ ఇంటికి అందేలా చూడాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, సుభాన్‌రెడ్డి, అంజయ్య, హరి, నరసింహారెడ్డి, కిరణ్‌కుమార్, సురేందర్ పాల్గొన్నారు.

నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన శ్రీనివాస్



కొడంగల్, అక్టోబరు 3: మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన చాకలి శ్రీనివాస్ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. నిరుపేద కుటుంబానికి చెందిన శ్రీనివాస్ ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ పరీక్షా ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో సోషల్ స్టడీస్‌లో 2వ ర్యాంకు, వికారాబాద్ జిల్లాలో మొదటి ర్యాంకు సాధించి సత్తా చాటాడు. అదే విధంగా ఇటీవలే వెలువడిన గురుకుల పరీక్షా ఫలితాల్లో టీజీటీ, పీజీటీ, హాస్టల్ వార్డెన్ ఉద్యోగాలు జోన్ 6లో 17 ర్యాంకుతో సాధించాడు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ టీ.అనితాపకీరప్ప, గ్రామస్తులు శ్రీనివాస్‌ను అభినందించారు.

తైక్వాండోలో విశ్వికకు గోల్డ్ మెడల్

పరిగి, అక్టోబరు 3: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తైక్వాండోలో అండర్-14 జిల్లా స్థాయిలో పరిగి పట్టణంలోని కేటీఎస్ ఆరోతరగతి చదువుతున్న వార్ల విశ్విక ప్రతిభ చాటి గోల్డ్ మెడల్‌ను సాధించింది. వికారాబాద్‌లోని తేజ ఫంక్షన్ హాల్‌లో గురువారం నిర్వహించిన పోటీల్లో ప్రతిభను చాటింది. జిల్లాస్థాయిలో ప్రతిభను చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా వార్ల విశ్వికను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి గోపాల కృష్ణ, మాస్టర్లు మెడల్స్‌తో ఘనంగా సన్మానించారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభను చాటి మెడల్‌ను సాధిస్తామనని విశ్విక తెలిపారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణాలపై సీడీఎంఏకు ఫిర్యాదు

ఘట్‌కేసర్, అక్టోబరు 3: ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణంపై ఘట్‌కేసర్‌కు చెందిన మాజీ పంచాయతీ సభ్యుడు మీసాల సుధాకర్‌రావు గురువారం సీడీఎంఏకు ఫిర్యాదు చేశారు. ఘట్‌కేసర్‌లోని ప్రధాన రోడ్డులో దాదాపు రూ.4కోట్లు విలువచేసే ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయమై మున్సిపల్ కమిసనర్‌కు ఫిర్యాదు చేసినా కనీస చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ అనితపై కేసు ఉన్నందున ఆమెను విధుల్లోంచి తొలగించాలని కోరారు. గతంలో మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రూ.3కోట్లకు పైగా అక్రమాలకు పాల్పడినందున తక్షణమే అనితను విధుల్లోంచి తొలగించాలని కోరారు.

పిల్లల ఆత్మరక్షణకు తైక్వాండో నేర్పించాలి

వికారాబాద్, అక్టోబరు 3: పిల్లల ఆత్మరక్షణకు తైక్వాండో నేర్పించాలని తైక్వాండో రాష్ట్ర నాయకుడు రాఘవన్ నాయక్ తెలిపారు.పట్టణంలోని తేజ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు జిల్లా స్థాయి తైక్వాండో టోర్నమెంట్, సెలక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ అనంతయ్య, నర్సింహులు, ఆనందం, గోపాల కృష్ణ పాల్గొన్నారు.

చెన్‌గోముల్ పీఎస్‌ను సందర్శించిన డీఎస్పీ

పూడూరు, అక్టోబరు 3: మండలంలోని చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్‌ను పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి సందర్శించారు. పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. పెండింగ్ కేసులను త్వరగా విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ ఫైల్ చేయాలని ఎస్ఐ మధుసూదనరెడ్డిని ఆదేశించారు. అనంతరం డీఎస్పీ సిబ్బందితో మాట్లాడుతూ.. విలేజ్ పోలీసు అధికారులు అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వక సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదనరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'చలో కామారెడ్డి'ని విజయవంతం చేయాలి

షాబాద్, అక్టోబరు 3 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వరంగల్ డిక్లరేషన్ డిమాండ్ల సాధనలో భాగంగా 5న తలపెట్టిన 'చలో కామారెడ్డి' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మాజీ అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ... రాహుల్ గాంధీ సమక్షంలో వరంగల్ వేదికగా కాంగ్రెస్ ప్రకటించిన రైతాంగ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం అడ్డగోలు నిబంధనలు పెట్టి రైతులను మోసం చేసిందన్నారు. రైతు భరోసా ద్వారా కౌలు రైతులకు రూ.15 వేలు ఇవ్వాల్సిందేనన్నారు. రాష్ట్రంలో మూతపడిన చక్కెర కర్మాగారాలను తెరిపిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలన్నారు. వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగుల మందుల పైన ఉన్న జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం వెంటనే తొలగించాలన్నారు. రాష్ట్రంలో విజయ పాల రైతులు అధ్వాన స్థితిని ఎదుర్కొంటున్నారన్నారు. వారికి 5 నెలలుగా పాలసేకరణలో ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వలేదన్నారు. డిక్లరేషన్ డిమాండ్ల సాధనలో భాగంగా కామారెడ్డిలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు రైతులు, భారతీయ కిసాన్ సంఘం నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు దండు యాదవరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్యనారాయణరెడ్డి, సభ్యులు వీరేశం, చంద్రబాబు పాల్గొన్నారు.

మొదలైన శరన్నవరాత్రోత్సవాలు

● దుర్గా మాతలకు ప్రత్యేక పూజలు


ఎక్లాస్‌ఖాన్‌పేటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న భక్తులు

కేశంపేట, అక్టోబరు 3: దసరా పండుగ నేపథ్యంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు దేవీమాత పూజలతో గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని తొమ్మిది రోజుల పాటు రోజుకో రూపంలో కొలుస్తారు. కేశంపేట మండలం సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, తులవానిగడ్డ, కొత్తపేట, కేశంపేట, ఇప్పలపల్లి, కొండారెడ్డిపల్లి, పాపిరెడ్డిగూడ, వేముల్‌నర్వల్లో దేవీమాత విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రథమపూజ నిర్వహించారు. మొదటి రోజు బాలత్రిపుర సుందరిదేవి అవతారంలో అమ్మవారికి పూజలు చేశారు. ఎక్లాస్‌ఖాన్‌పేటలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, తలవానిగడ్డలో మాజీ ఎంపీటీసీ లంకాల సురేష్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు.

షాద్‌నగర్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా షాద్‌నగర్‌లోని కన్యకా పరమేశ్వరి, కోటమైసమ్మ ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

షాబాద్: కేశవగూడ, షాబాద్, కుమ్మరిగూడ, మల్లారెడ్డిగూడ, హైతాబాద్, తాళ్లపల్లి, సర్దార్‌నగర్, బొబ్బిలిగామల్లో దేవీనవరాత్రులు ప్రారంభమయ్యాయి. అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

చేవెళ్ల: చేవెళ్లలోని రచ్చబండ వద్ద ఏర్పాటు చేసిన దుర్గమాత విగ్రహానికి జైభవానీ కమిటీ సభ్యులు ప్రారంభించారు. కొనగట్టు ఆలయంలో


అర్కపల్లిలో దుర్గామాత విగ్రహం వద్ద గ్రామస్తుల పూజలు

భ్రమరాంబ, బ్రహ్మగిరీ క్షేత్రంలో అమ్మవారలకు పూజలు చేశారు. లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఊరేగింపు నిర్వహించారు.

మాడ్గుల: అర్కపల్లిలో దుర్గామాత మండపాన్ని నెలకొల్పారు. విగ్రహ దాతలు మురుపోజు బ్రదర్స్ ఐశ్వర్యాచారి, అరవింద్‌చారి, శ్రీనుచారి, వెంకటేశ్వరచారి దంపతులు పూజలు చేశారు. యాచారం కాటం రాజుగౌడ్ ఆధ్వర్యంలో భవానీ దీక్ష తీసుకుంటున్నారు.

కడ్తాల్: మైసిగండి శివరామాలయంలో శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈఓ స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ సిరోళి పంతూ ఉత్సవాలను ప్రారంభించారు. ధ్వజారోహణం, పూర్ణకుంభం, అంకురార్పణ, కలశ పూజల్లో భక్తులు పాల్గొన్నారు. చండీ హోమం, పారాయణంలో తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి-అరుణ్ దంపతులు పాల్గొన్నారు. తొలిరోజు పూజల్లో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఎర్రోళ్ల రాఘవేందర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లులోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ ఛైర్మన్ వీరబొమ్మ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తొలి రోజు అమ్మ వారు బాలత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.


షాద్‌నగర్: కన్యకాపరమేశ్వరి ఆలయంలో బాలాత్రిపురసుందరిదేవి అలంకరణ


ఆమనగల్లు కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమంలో బికుమాండ్ల రమేశ్, నర్సింహ దంపతులు

హోమంలో బి.రమేశ్-వాసవి, నర్సింహ-సుజాత దంపతులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నటరాజ్ యాదయ్య, వాస శ్రీను, వాసు, పాండయ్య, మల్లేశ్, అర్థం లక్ష్మయ్య, కె.రమేశ్, తేజ, మణికంఠ, సిద్ధు, వెంకటేశ్, నాగరాజు, లింగ య్య, సుమన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. కోనాపూర్‌లో దుర్గామాత మండపాన్ని నెలకొల్పారు. తొలిరోజు పూజల్లో టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి యాదిలాల్, లట్టుపల్లి బాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఈదమయ్య, జగన్, మహేశ్, మహేందర్, శ్రీనాథ్, శివ, యాదయ్య పాల్గొన్నారు. కట్టమైసమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ మొక్తాల వెంకటయ్య ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. వెంకట్‌రెడ్డి, వై.మహేశ్, శ్రీశైలం, సిద్ధు, సతీష్, వెంకటేశ్, సాయి, రాజు, యాదయ్య పాల్గొన్నారు.

చౌదరిగూడ: తుమ్మలపల్లి, జిల్లేడ్, పెద్దఎల్కిచర్ల, గాలిగూడ, చేగిరెడ్డి ఘణాపూర్, వీరన్నపేట్ లచ్చంపేట్, పీర్జాపూర్ గ్రామాల్లో ఆలయాలను అలంకరించారు. కొందుర్గు, ముట్పూర్, తంగెళ్లపల్లి గ్రామాల్లో అమ్మవారి మండపాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

శంషాబాద్: శంషాబాద్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఊట్‌పల్లిలోని శృంగేరి శంకరమఠ ఆలయం, ముచ్చింతల్ చినజీయర్‌స్వామి ఆశ్రమ దివ్యసాకేతం వద్ద శరన్నవరాత్రి వేడుకలు మొదలయ్యాయి. చిన జీయర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో పెదజీయర్ స్వామి విగ్రహం వద్ద ఉత్సవ పూజలు జరిగాయి.

యాచారం: నందివనపర్తిలోని సరస్వతిదేవి ఆలయంలో కుంకుమార్చన, లలితపారాయణం తదితర పూజలు నిర్వహించారు.


కోనాపూర్‌లో దుర్గామాత పూజల్లో టీడీపీ నాయకుడు యాదీలాల్


ఊట్‌పల్లి శంకరమఠం ఆలయంలో అమ్మవారి బ్రహ్మీదేవి అలంకరణ


షాబాద్: మండపంలో కొలువుదీరిన అమ్మవారు


మైసిగండిలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఈవో స్నేహలత, ఫౌండర్ ట్రస్టీ సిరోళి పంతూ, పాల్గొన్న నాయకులు

ముమ్మరంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే


కుటుంబ వివరాలు నమోదు చేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఆదిభట్ల, అక్టోబరు 3: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. ప్రతీ నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సర్వేలో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఆదిభట్లలో మున్సిపల్ ఛైర్మన్ ఎం.నిర ంజన్‌రెడ్డి, కమిషనర్ బాలకృష్ణలతో కలిసి డిజిటల్ కార్డు సర్వేను ప్రారంభించారు. కడ్తాల యాదమ్మ ఇంటికి వెళ్లి కుటుంబ వివరాలు తెలుసుకున్నారు. అప్లికేషన్‌లో ఎమ్మెల్యే స్వయంగా వివరాలు నమోదు చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలకిచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామన్నారు. ప్రతీ పేద కుటుంబానికి రేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు ఇస్తామన్నారు. అధికారులు వచ్చి వివరాలు సేకరిస్తారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రూ.31వేల కోట్లతో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేశారన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ కె.యాదగిరి, నాయకులు రాచర్ల వెంకటేశ్వర్లు, శేఖర్‌గౌడ్, గురునాథ్‌రెడ్డి, కె.శివకుమార్, పాండు రంగారెడ్డి, రజనీకాంత్‌గౌడ్, సాంబయ్యగౌడ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆమనగల్లు: పేదల ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ విఠాయిపల్లిలో డిజిటల్ కార్డుల సర్వేను ఆయన ప్రారంభించారు. ఛైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ ఛైర్మన్ దుర్గయ్య, అడిషనల్ కలెక్టర్ గోపిరామ్, తహసీల్దార్ లలిత, కమిషనర్ వసంతలతో కలిసి కుటుంబాల వివరాలు తెలుసుకున్నారు. ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇస్తామని తెలిపారు. ఆస్పత్రుల్లో చికిత్సలకు, సంక్షేమ పథకాల వర్తింపునకు ఈ ఫ్యామిలీ కార్డు రక్షణగా ఉంటుందన్నారు. సర్వే ఆధారంగా కుటుంబీకుల ఆధార్ నంబర్లు యాడ్‌చేసి ప్రభుత్వం డిజిటల్ కార్డులు జారీ చేస్తుందని తెలిపారు. వివరాల నమోదులో అధికారులు, సిబ్బంది ఎక్కడా తప్పులకు ఆస్కారం ఇవ్వొద్దని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుజాతరాములు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, నాయకులు జగన్, పర్వతాలు, మానయ్య, శ్రీను, వెంక ట్‌రెడ్డి, బాబ, ఖాదర్‌ఖాద్రీ, రహీం, వస్పుల శ్రీకాంత్, శ్రీశైలం, రాములు పాల్గొన్నారు.


విఠాయిపల్లిలో డిజిటల్ కార్డు సర్వే నమోదును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి


మహేశ్వరం: పెద్దమ్మతండాలో డిజిటల్ కార్డుల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మహేశ్వరం: ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వేను పకడ్బందీగా చేయాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. పెద్దమ్మతండాలో సర్వేను ప్రారంభించారు. అదనపు కలెక్టర్, అధికారులు ఇంటింటికి తిరిగి కుటుంబాల వివరాలను తెలుసుకున్నారు. ఐదు రోజుల్లో సర్వే నివేదిక అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో శైలజారెడ్డి, డీటీ నవత ఉన్నారు.

షాద్‌నగర్ రూరల్: డిజిటల్ కార్డు నమోదు ప్రక్రియను సమగ్రంగా నిర్వహించాలని ఆర్డీవో వెంకటమాధవరావు సూచించారు. డిజిటల్ కార్డు పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన ఫరూఖ్‌నగర్ మండలం కాడియాలకుంటతండాను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబ సభ్యుల్లో వయసు ఎక్కువ ఉన్న మహిళను కుటుంబ పెద్దగా గుర్తిస్తామని తెలిపారు. ప్రతీ కుటుంబ సభ్యుడి ఫోన్ నంబరు సేకరించాలన్నారు. కుటుంబ యజమాని, వారి సంబంబందాలను విధిగా నమోదు చేయాలని అన్నారు. కుటుంబ సభ్యుల ఫొటో తప్పక సేకరించాలని తెలిపారు. కొత్తగా వివాహం చేసుకున్న మహిళ పేరిట రేషన్‌కార్డు ఇస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్థసారథి, ఎంపీడీవో జయంత్‌రెడ్డి ఉన్నారు.

నేడు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

చేవెళ్ల, అక్టోబరు 3: ఈ నెల 4న చేవెళ్లలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 221 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ, మరో 33మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఉంటుందన్నారు. ఉదయం 10గంటలకు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే యాదయ్య చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. లబ్ధిదారులు సకాలంలో హాజరై చెక్కులు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

... ఇంద్రారెడ్డి జయంతి వేడుకలు

చేవెళ్ల, అక్టోబరు 3 : ఈ నెల 4న దివంగత మాజీ హోం మంత్రి ఇంద్రారెడ్డి జయంతిని నిర్వహిస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఉదయం 9గంటలకు చేవెళ్లలోని ఇంద్రారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేస్తామన్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, కుటుంబ సభ్యులు కౌకుంట్లలోని ఆయన సమాధి వద్ద జయంతిని నిర్వహిస్తారన్నారు.

ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, అక్టోబరు 3: చేవెళ్లలో నిర్వహించే ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్లలోని పద్మావతి కన్వెన్షన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల ఐదో తేదీన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులను సన్మానిస్తామన్నారు. కార్యక్రమం ఉదయం 10గంటలకు పద్మావతి కన్వెన్షన్‌లో నిర్వహిస్తామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, విద్యాశాఖ కమిషన్ ఛైర్మన్ మురళి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు హాజరవుతారని చెప్పారు. ఉపాధ్యాయులంతా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు మర్పల్లి కృష్ణారెడ్డి, హన్మంతరెడ్డి, రవీందర్‌గౌడ్, టీచర్లు పోచయ్య, ఆశీర్వాదం పాల్గొన్నారు.

అభివృద్ధిలో దూసుకుపోతున్న మోకిలి : ఎమ్మెల్యే

శంకర్‌పల్లి: అభివృద్ధిలో మోకిల దూసుకుపోతున్నదని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. మోకిలోని సుభాషి టౌన్‌షిప్ సెంటర్‌లో ఉడిపి ఉప విహార్ 42వ బ్రాంచ్‌ని ఆయన, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మోకిలకు పేరుమోసిన సంస్థలు వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. హోటల్ యజమానులు అరుణ్ జోగినపల్లి, రఘులను ఎమ్మెల్యేలు అభినందించారు.

యువత స్ఫూర్తితో ముందుకుసాగాలి


చెన్నయ్యను సన్మానిస్తున్న ఎస్ఐ విజయ్

చౌదరిగూడ, అక్టోబరు 3: ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం అవుతున్న యువత చెన్నయ్యను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ అన్నారు. ఎల్కగూడకు చెందిన బోయ చెన్నయ్య ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించడం చాలా సంతోషమని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న యువత చెన్నయ్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నర్సింహులు, రాములు, రవికుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.


'క్రైస్తవులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలి'

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 3: క్రైస్తవులపై దాడులు చేసిన హిందూ వాహిని కార్యకర్తలను అరెస్టు చేయాలని క్రైస్తవ ధర్మ ప్రచార సమితి అధ్యక్షుడు జెరుసలేం ముత్తయ్య గ టురువారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. గత నెల 28న ఇబ్రహీంపట్నంలో బలవంతపు మత మార్పిడి చేస్తున్నారంటూ క్రిస్టియన్ ఎడ్యుకేషనల్ కౌన్సిలింగ్ సెంటర్‌పై దాడిచేశారని పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ ఇవ్వడం తప్పు కాదని, ఇది మత ప్రచారం కాదని, మెడిటేషన్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంఘటన జరిగి ఐదు రోజులవుతున్నా పోలీసులు కేసులు నమోదు చేయకుండా బాధితులపైనే కౌంటర్ కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి


తలకొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీకాంత్

తలకొండపల్లి, అక్టోబరు 3: మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎంపీడీవో శ్రీకాంత్ కోరారు. తాగునీటి పైపులైన్ల లీకేజీలను సరిచేసి తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తలకొండపల్లి మండల పరిషత్‌లో గురువారం మిషన్ భగీరథ గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ నిర్వహించారు. ఐదు రోజుల శిక్షణలో భాగంగా తొలి రోజు పైపు లైన్‌ల లీకేజీల మరమ్మతులు, సరఫరాపై అవగాహన కల్పించారు. ఎక్కడా సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని ఎంపీడీవో కోరారు. కార్యక్రమంలో ఎంపీవో రఘు, ఏఈలు ప్రణీత్, కేతన్, మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.


రాంనుంతలలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి సరఫరాలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటోందన్నారు. రాంనుంతల రైతు వేదికలో ఆమనగల్లు, కడ్తాల మండలాల మంచి నీటి సహాయకులకు శిక్షణ నిర్వహించారు. డీఈ మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఈఈ రాజేశ్, డీఈ రామకృష్ణలు పాల్గొన్నారు. ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, ఏఈలు సందీప్, శ్రావ్య, వాగ్దేవి, ఎంపీవో వినోద పాల్గొన్నారు.

'రేషన్ కార్డులపై ప్రభుత్వం స్పష్టతివ్వాలి'

కేశంపేట, అక్టోబరు 3: రేషన్ కార్డులపై ప్రభుత్వం స్పష్టతివ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కర్రెడ్ల నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంతాపూర్‌లో గురువారం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్టోబరు 2వరకు రేషన్ కార్డులిస్తానని చెప్పి నేటికీ రేషన్ కార్డులు ఇవ్వలేదన్నారు. ఇప్పుడు నేడు డిజిటల్ ఫ్యామిలీ కార్డులంటు కాలయాపన చేస్తోందన్నారు. రైతు భరోసా ఇచ్చి, రుణమాఫీ పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు.

ఓర్వలేకనే హైడ్రాపై ఆరోపణలు


మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

షాద్‌నగర్, అక్టోబరు 3: హైడ్రాతో తమ పార్టీకి ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతోనే అక్రమ నిర్మాణాల కూల్చివేతలపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. గురువారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీనియర్ నాయకులు రఘు, బాబర్‌ఖాన్, బాలరాజు మీడియాతో మాట్లాడారు. 2016లోనే సీఎంగా కేసీఆర్ హైదరాబాద్‌లో చెరువులు, కుంటల సంరక్షణకు ఆక్రమణలను కూల్చుతామని ప్రకటించారని గుర్తుచేశారు. అదే పని ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంటే ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. బీ ఆర్ఎస్ హయాంలోనే ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అనుమతులిచ్చారని ఆరోపి ంచారు. సోషల్ మీడియాలో అడ్డగోలుగా ప్రచారం చేస్తే సహించం అన్నారు.

ఫార్మాలో ఒక్క రైతునూ నష్టపోనివ్వం


లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న మీర్ఖాన్‌పేట రైతులు

కందుకూరు, అక్టోబరు 3: ఫార్మాసిటీకి భూములిచ్చిన ప్రతీ రైతుకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మీర్ఖాన్‌పేట రైతులు, మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహలతో కలిసి కేఎల్లార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారితో ఆయన మాట్లాడారు. నాలుగు గ్రామాల్లో ఫార్మాసిటీకి భూములిచ్చిన వారికి ప్లాట్లు, పరిహారం వచ్చేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ కో-ఆప్షన్ మెంబర్‌గా పొట్టి ఆనంద్


ఎమ్మెల్యే సబితారెడ్డి నుంచి నియామకపత్రం అందుకుంటున్న ఆనంద్

కందుకూరు, అక్టోబరు 3 : జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ కో-ఆప్షన్ సభ్యుడిగా పొట్టి ఆనంద్‌ను నియమించినట్లు సంఘం ఛైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య తెలిపారు. గురువారం నగరంలోని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి నివాసంలో ఆనంద్‌కు నియామక పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కందుకూరు సొసైటీ డైరెక్టర్ అయిన ఆనంద్‌ను ఎస్సీ కోటాలో కో-ఆప్షన్ మెంబరుగా నియమించిన ఛైర్మన్ సత్తయ్యను అభినందించారు. నిత్యం రైతు సమస్యలపై పనిచేసే ఆనంద్ డీసీసీబీ కో-ఆప్షన్ సభ్యుడిగా మరిన్ని సేవలందిస్తారనే నమ్మకం తనకుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను నెరవేర్చడంలేదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ ఛైర్మన్ డి.చంద్రశేఖర్, వైఎస్ ఛైర్మన్ జి.విజయేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జయేందర్, డైరెక్టర్లు నర్సింహ, నాయకులు దశరథ్, డి.కృష్ణారెడ్డి, ఎస్.సుదర్శన్‌రెడ్డి, సురేశ్, నవీన్‌కుమార్, దయ్యాల శ్రీనివాస్, రాజు, దయానంద్, ప్రశాంత్, రాకేష్, ఎం.కృష్ణ తదితరులు నాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి సన్మానం


పారిశుధ్య సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్ఐ వెంకటేశ్

ఆమనగల్లు, అక్టోబరు 3: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా సమర్థంగా విధులు నిర్వహించిన మున్సిపల్ సిబ్బందిని పోలీసులు అభినందించారు. గురువారం పోలీసుస్టేషన్ ఆవరణలో సిబ్బంది రవి, గోపి, విజయ్, ప్రశాంత్, నర్సింహ, శ్రీను, పెంటయ్య, సుధాకర్, చిన్న, చిట్టిబాబు, రామకృష్ణ, రాములును ఎస్ఐ వెంకటేశ్ శాలువాలతో సత్కరించారు. పారిశుధ్య సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ యాదయ్య, బాల్‌రెడ్డి, రంజిత్, పాల్గొన్నారు.

సంపాదనలో కొంత దానం చేయాలి


చీర అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కేశంపేట, అక్టోబరు 3: ప్రతీ వ్యక్తి తన సంపాదనలో కొంత పేదలకు దానం చేయాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కోరారు. కొండారెడ్డిపల్లి యువకుడు, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌గౌడ్ గురువారం మహిళలకు చీరల పంపిణీ చేపట్టారు. ముఖ్య అతిథి అంజయ్య చీరలను అందజేశారు. సమాజ హితానికి సంపాదనలో కొంత దానం చేయాలన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా చీరలు అందజేయడం అభినందనీయమన్నారు. 800మంది మహిళలకు చీరలను అందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నర్సింగ్‌రావు, జడ్పీ వైస్‌ఛైర్మన్ గణేశ్, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, ప్యాక్స్ ఛైర్మన్ జగదీశ్వర్‌గౌడ్, మురళీధర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, జమాల్‌ఖాన్, ఆంజనేయులు, ఉదయ్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక నిలయాలు

కడ్తాల్, అక్టోబరు 3: దైవ కార్యక్రమాల్లో ప్రతొక్కరూ పాలుపంచుకోవాలని మైసిగండి మైసమ్మ ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, తహసీల్దార్ జ్యోతి కోరారు. ఆలయాల వద్ద పూల, నీడ, పండ్ల నిచ్చే మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. మైసిగండి శివాలయం వద్ద గురువారం రుద్రాక్ష, పారిజాతం మొక్కల పెంపకాన్ని నిర్వహించారు. వారు ఆలయ సిబ్బంది, భక్తులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కల పెంపకం ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై భక్తులకు అవగాహన కల్పించారు. ఆలయాలు ఆధ్యాత్మికత, మానసిక వికాసానికి నిలయాలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సమాజ శాంతిని కాంక్షించి సన్మార్గంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు రమావత్ భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యానాయక్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవేందర్, అరుణ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నాలుగు తులాల బంగారు ఆభరణాల చోరీ

యాచారం, అక్టోబరు 3 : గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ పరిధి ఆకులమైలారంలో ఓ ఇంట్లో దొంగలు 4తులాల బంగారు ఆభరణాలు, రూ.10వేల నగదు ఎత్తుకపోయారు. ఈ ఘటన గురువారం వెలుగులోకొచ్చింది. గ్రామానికి చెందిన అవారు జంగయ్య రెండు రోజుల క్రితం కుటుంబంతో కలిసి బంధువుల ఊరికెళ్లారు. గురువారం ఉదయం వచ్చే సరికి ఇంట్లో చోరీ జరిగిన విషయం గుర్తించారు. అల్మారాలో దాచిన నగలు, నగదు చోరీచేశారని గుర్తించారు. దొంగతనంపై సమాచారమందుకున్న గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు చేరుకొని విచారణ చేపట్టారు. సీఐ నర్సింహరావు క్లూస్‌టీంను పంపి ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా చోరీ జరిగిన ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాలు పనిచేయలేదు. హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ పంచాయతీ కార్యాలయంలో సీసీ టీవీని తనిఖీ చేయగా కెమెరాలు రికార్డు చేయలేదని తెలిసి ఖంగుతిన్నారు. కెమెరాలు పనిచేసుంటే దొంగలు దొరికేవారని గ్రామస్తులన్నారు.